సాక్షి గుంటూరు

బుధవారం၊ 5၊ మార్చి၊ 2025



అమ్మవారికి ప్రత్యేక పూజలు

బాపట్ల: చందోలులోని బగళాముఖి దేవస్థానంలోని అమ్మవారిని కలెక్టర్ జె.వెంకట మురళి మంగళవారం దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.



ఆలయ నిర్మాణానికి విరాళం

నరసరావుపేటరూరల్: ఇస్సప్పాలెం మహంకాళి గుడి నిర్మాణానికి జూలకల్లుకి చెందిన చలంచర్ల వెంకటేశ్వర్లు దంపతులు రూ.1.01,116 విలువైన చెక్కు అందజేశారు.



అగ్రి ల్యాబ్ పరిశీలన

నరసరావుపేటరూరల్: కేంద్ర ప్రభుత్వ రాష్ట్రీయ క్రిషి వికాస్ యోజన పథకంలో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్‌ను మంగళవారం థర్డ్ పార్టీ ఎవాల్యేషన్ బృందం పరిశీలించింది.



రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (బుధ)	సహరి (గురు)
గుంటూరు	6.21	5.06
నరసరావుపేట	6.23	5.08
బాపట్ల	6.21	5.06

న్యూస్‌రీల్

జలపాలేశ్వరుడిపై సూర్యకిరణాలు



ఫిరంగిపురం: మండలంలోని వేములూరిపాడు గ్రామంలోని జలపాలేశ్వర ఆలయంలో స్వామిపై మంగళవారం సూర్యకిరణాలు ప్రసరించాయి. ఈ సమయంలో అనేకమంది భక్తులు ఆలయానికి వచ్చి స్వామికి అభిషేకాలు చేయించుకున్నారు. గ్రామంలో చోళుల కాలంనాటి జలపాలేశ్వర ఆలయం ఉంది. 16వ శతాబ్దంలో నిర్మించిన ఈ ఆలయంలోని జలపాలేశ్వరుడిపై ఏటా పాల్గుణ మాసంలో కొద్దిరోజులపాటు సూర్యోదయ కాలంలో సరాసరి స్వామివారి లింగాకృతి కింది భాగం నుంచి పూర్తిగా స్వామిపై వరకు సూర్యకిరణాలు ప్రసరిస్తాయని ఆలయ అర్చకులు ఉమాపతి శాస్త్రి తెలిపారు. మళ్లీ అవి తగ్గుముఖం పట్టి పూర్తిగా సూర్యకిరణాలు ప్రసరించడం ఆగుతుందని తెలిపారు.

నృసింహుని ఏకాదశ మాలధారణ దీక్ష స్వీకరణ



మంగళగిరిటౌన్: మంగళగిరిలోని లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం ఎగువ సన్నిధిలోని పానకాలస్వామి వారి ముఖ మండపంలో మంగళవారం భక్తులు నృసింహుని ఏకాదశ మాలధారణ దీక్ష స్వీకరణ మహోత్సవం జరిగింది. దేవస్థానం ప్రధాన అర్చకులు, గురుస్వామి మాల్యవంతం శ్రీనివాసదీక్షితులు భక్తులకు మాలవేసి దీక్ష ఇచ్చారు. స్థానిక శ్రీ లక్ష్మీనరసింహస్వామి సేవా ట్రస్ట్ అధ్యక్షులు తోట శ్రీనివాసరావు మాలధారణ దీక్ష స్వీకరించే భక్తులకు దీక్షా వస్త్రాలను ఉచితంగా అందజేశారు. అనంతరం రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి అధ్యక్షులు గాజుల శ్రీనివాసరావు, న్యాయవాది రంగిశెట్టి లక్ష్మి మాట్లాడారు. కార్యక్రమంలో శివారెడ్డి గురుస్వామి, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు గోగినేని వెంకటేశ్వరరావు, రోటరీ క్లబ్ ప్రతినిధి సైదా నాయక్, శివాలయం మాజీ ధర్మకర్త అన్నపురెడ్డి రామకృష్ణారెడ్డి, భక్త బృందం ప్రతినిధులు బుర్రి సతీష్, హనుమంత నాయక్, మాదల గోపీ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సమావేశాలకు ఐదుగురికి ఆహ్వానం

సత్తెనపల్లి: అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయడంలో ప్రత్యేకత చాటుకున్న ఎంపీడీవో, గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులకు ఈనెల 4, 5 తేదీల్లో ఢిల్లీలో జరగనున్న జాతీయ సమావేశానికి ఆహ్వానం అందింది. గుంటూరు జిల్లా పెదనందిపాడు ఎంపీడీవో లక్ష్మీదేవి, గుంటూరు రూరల్ మండలం వెంగళాయపాలెం సర్పంచ్ ఎం.లలితకుమారి, వెంగళాయపాలెం కార్యదర్శి వి.రవి, కొల్లిపర మండలం వల్లభాపురం సర్పంచ్ భ్రమరాంబ, పల్నాడు జిల్లా నరసరావుపేట మండలం పమిడిపాడు సర్పంచ్ షేక్ గౌసియా బేగం స్నేహపూర్వక పంచాయతీల (ఉమెన్ ఫ్రెండ్లీ పంచాయతీ) పేరుతో ప్రత్యేక కార్యక్రమాలను పంచాయతీలో అమలు చేస్తున్నారు. ఇందుకు ఢిల్లీలో జరిగే జాతీయస్థాయి సమావేశాలకు వీరికి ఆహ్వానం అందడంతో సోమవారం పయనమై వెళ్లారు.

ఎండీయూ వాహనం తనిఖీ



మంగళగిరిటౌన్: మంగళగిరి నగరపాలక సంస్థ పరిధిలోని ఎర్రబాలెంలో రేషన్ బియ్యాన్ని ఇంటింటికీ సరఫరా చేసే ఎండీయూ వాహనాన్ని మంగళవారం పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తనిఖీ చేశారు. స్థానికులతో మాట్లాడి రేషన్ పంపిణీ విషయంలో ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. రోజుకు ఎంత మందికి రేషన్ అందజేస్తున్నారన్న విషయాన్ని పరిశీలించారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు వై.వి.సుబ్బారెడ్డి

జగనన్న దళం.. పోరు గళం

తగ్గేదే.. లే

- ప్రజల పక్షాన ధ్వజమెత్తుదాం
- ప్రతిఒకరం సైనికుడై కదులుదాం
- భవిష్యత్తులో కార్యకర్తలకు ప్రాధాన్యం
- రాజ్యసభ సభ్యుడు వై.వి.సుబ్బారెడ్డి

తాడేపల్లిరూరల్: ప్రజల పక్షాన పోరుజెండా ఎత్తాల్సిన సమయం ఆసన్నమైందని, దీని కోసం ప్రతి కార్యకర్త, నాయకుడు సైనికులై ముందుకు కదులుదామని రాజ్యసభ సభ్యులు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కో–ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి చెప్పారు. మంగళవారం కుంచనపల్లిలోని శ్రీగ్రాండ్ ఫార్ట్యూన్‌లో వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా రెండో కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రాజ్యసభ సభ్యుడు, పార్టీ రాష్ట్ర కో–ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి మాట్లాడుతూ కేసులకు అదరని, బెదరని కార్యకర్తలు, నాయకులు వైఎస్సార్ సీపీ సొంతమని, గుంటూరు జిల్లా పార్టీ శ్రేణులు రాష్ట్రానికే ఆదర్శమని, క్రమం తప్పకుండా జిల్లా కార్యవర్గ సమావేశాలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రధానంగా రైతులు మద్దతు ధర దక్కక నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల పక్షాన వైఎస్సార్ సీపీ పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. విద్యార్థులూ సకాలంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ రాక నష్టపోతున్నారని, ఈనెల 12న జరిగే ఫీజు పోరు ధర్నాను జయప్రదం చేసి ప్రభుత్వం మెడలు వంచుదామని పేర్కొన్నారు. మిర్చి రైతుల సమస్యలపై గుంటూరులో వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గళమెత్తిన తర్వాతే ప్రభుత్వం కదిలిందని గుర్తుచేశారు. ఈ తొమ్మిది నెలల కాలంలో కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ హామీలను అమలు చేయకుండా వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులే లక్ష్యంగా కేసులతో వేధించిందని, భవిష్యత్తులోనూ కేసులు తప్పవని, అయినా అదరక, బెదరక ముందుకు సాగే కార్యకర్తలే మన బలమని ధీమా వ్యక్తం చేశారు. ప్రజల పక్షాన పోరుబాటలో ముందుకు కదులుదామని వైవీ సుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ గుంటూరు, పల్నాడు జిల్లాల పరిశీలకులు మోదుగుల వేణుగోపాలరెడ్డి, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, వివిధ నియోజకవర్గాల సమన్వయకర్తలు వనమా బాల వజ్రబాబు, అంబటి మురళీకృష్ణ, షేక్ నూరి ఫాతిమా, బలసాని కిరణ్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శి నిమ్మకాయల రాజనారాయణ, రాష్ట్ర విద్యార్థి విభాగం అధ్యక్షులు పానుగంటి చైతన్య, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఐదు తీర్మానాలు ఆమోదం

పార్టీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు రూపొందించిన ఐదు అంశాలను సమావేశంలో దొంతిరెడ్డి వేమారెడ్డి ప్రతిపాదించగా సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. ఆ ఐదు అంశాలు ఇవే..

- సర్కారు మోసపూరిత విధానాల వల్ల మిర్చి రైతులకు గిట్టుబాటు ధర అందడం లేదు. దీనిని ఖండించాలి.
- తక్షణమే మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించి మిర్చిని రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేయాలి.
- గుంటూరు జిల్లాలో మిర్చి బోర్డు ఏర్పాటు చేయాలి.
- శనగ, జొన్న, మొక్కజొన్న, పత్తి ఇతర వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించాలి.
- ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ఈనెల 12న రాష్ట్ర వ్యాప్తంగా జరిగే నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి.
- వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులను, అరెస్టులను తీవ్రంగా ఖండించాలి.

కేసులకు భయపడం



వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సంక్షేమానికి పెద్దపీట వేసింది. ప్రస్తుత సీఎం చంద్రబాబు, కూటమి నాయకులు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారు. సర్కారుపై పోరుజెండా ఎగురేద్దాం. సినీ నటుడు పోసాని మురళీకృష్ణను కేసులతో ఇబ్బంది పెడుతున్నారు. రేపు మనపైనా కేసులు పెట్టొచ్చు. కేసులకు భయపడే పార్టీ వైఎస్సార్ సీపీ కాదు.

– అంబటి రాంబాబు, వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు

కార్యకర్తలకు అండగా ఉంటాం



కార్యకర్తలకు అండగా ఉంటాం. వారిని ఇబ్బంది పెడితే సహించేది లేదు. కార్యకర్తల కోసం అంబటి రాంబాబు కష్టపడుతున్నారు. మనందరం కలిసికట్టుగా సర్కారుపై పోరాడాలి. భవిష్యత్తులో కష్టపడిన ప్రతి కార్యకర్తకూ గుర్తింపు ఉంటుంది.

– మోదుగుల వేణుగోపాలరెడ్డి, వైఎస్సార్ సీపీ గుంటూరు, పల్నాడు జిల్లాల పరిశీలకులు

రెడ్‌బుక్‌కు పాతరేద్దాం



కూటమి సర్కారు రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తోంది. దానికి ఉప్పుపాతరేసే దిశగా పోరాడదాం. ప్రజల్లో తిరుగుబాటు మొదలైంది. అయితే కేసులకు భయపడుతున్నారు. మనం ముందుండి పోరాడుదాం. వైఎస్ జగన్‌ను మళ్లీ సీఎంను చేద్దాం.

– షేక్ ఫాతిమా, వైఎస్సార్ సీపీ గుంటూరు నగర అధ్యక్షురాలు

రైతుకు వెన్నుదన్నుగా నిలుద్దాం



రైతులకు వెన్నుదన్నుగా నిలిచి పోరాడదాం. గతంలో ధాన్యం బస్తా రూ.1,700 నుంచి రూ. 2 వేలు అమ్మితే ఈ ఏడాది రూ. వెయ్యి నుంచి రూ.1,300 మాత్రమే పలికింది. ఒక్కో రైతుకు రూ.లక్షల్లో నష్టం వచ్చింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఇచ్చిన సంక్షేమ పథకాలు రైతులకు దూరమయ్యాయి. కూటమి ప్రభుత్వంపై రైతులు ఆగ్రహంగా ఉన్నారు.

– అంబటి మురళీకృష్ణ, వైఎస్సార్ సీపీ పొన్నూరు సమన్వయకర్త

ప్రజా సమస్యలే అజెండా



ప్రజలు సమస్యలతో బాధపడుతున్నారు. రైతులకు గిట్టుబాటు ధర లేదు. ప్రజా సమస్యలే మన అజెండా. పోరాటానికి సిద్ధమవుదాం. కేసులకు భయపడేది లేదు. వైఎస్ జగన్‌ను మరో మారు ముఖ్యమంత్రిగా చేసుకుందాం.

– దొంతిరెడ్డి వేమారెడ్డి, వైఎస్సార్ సీపీ మంగళగిరి సమన్వయకర్త

ఆలపాటి గెలుపు



ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌కు గెలుపు ధ్రువీకరణ పత్రం అందిస్తున్న ఎన్నికల అధికారి నాగలక్ష్మి

- మొదటి ప్రాధాన్య ఓట్లతోనే మ్యాజిక్ ఫిగర్
- 82,320 ఓట్ల మెజారిటీ
- అనైతికంగా గెలిచారంటున్న పీడీఎఫ్
- ప్రజలు కూటమికే పట్టం కట్టారన్న ఆలపాటి

సాక్షి ప్రతినిధి, గుంటూరు : కృష్ణా–గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీగా ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఎన్నికయ్యారు. మొత్తం తొమ్మిది రౌండ్ల కౌంటింగ్ జరగగా మొత్తం పోలైన ఓట్లు 2,41,774కి గాను 2,14,865 ఓట్లు చెల్లుబాటయ్యాయి. 26,909 ఓట్లు చెల్లలేదు. తెలుగుదేశం పార్టీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ 1,45,057 ఓట్లు సాధించారు. తన సమీప ప్రత్యర్థి పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావుకు 62,737 ఓట్లు వచ్చాయి. దీంతో ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ 82,320 ఓట్ల ఆధిక్యతతో గెలుపొందారు. మొదటి ప్రాధాన్య ఓట్లతోనే ఈ విజయం దక్కించుకున్నారు. మొత్తం 25 మంది అభ్యర్థులు బరిలో ఉండగా మిగిలిన వారెవరూ కనీస పోటీ ఇవ్వలేదు. మూడోస్థానంలో ఉన్న అన్నవరపు ఆనందకిషోర్‌కు 860 ఓట్లు దక్కగా గౌతుకట్ల అంకమ్మరావుకు అత్యల్పంగా 26 ఓట్లు దక్కాయి. మంగళవారం గుంటూరు కలెక్టర్ చాంబర్‌లో కృష్ణా, గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ శాసన మండలి ఎన్నికల రిటర్నింగ్ అధికారి, గుంటూరు కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు ధ్రువీకరణ పత్రం అందించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.ఎస్.కె.ఖాజావలి ఎన్నికల సెక్షన్ సూపరింటెండెంట్ మల్లేశ్వరి పాల్గొన్నారు.

దొంగ ఓట్లు, రిగ్గింగ్‌తో గెలిచారు

ఈ ఎన్నికల్లో దొంగ ఓట్లు, బూత్ క్యాప్చరింగ్, రిగ్గింగ్‌లతో అధికార పార్టీ గెలిచిందని పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు ఆరోపించారు. ఫలితాల వెల్లడి అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికలను రాజకీయం చేసిందని, తనపై ప్రత్యర్థులు దుష్ప్రచారం చేశారని, ఉద్యోగులు, ఉపాధ్యాయ వర్గాల మధ్య చీలిక తెచ్చారని, రూ.కోట్లు ఖర్చు చేశారని విమర్శించారు. అనేక చోట్ల ఎన్నికల రోజు, దొంగ ఓట్లు, అక్రమాలు చోటుచేసుకున్నాయని, దీనికి అధికార యంత్రాంగం కూడా సహకరించిందని ధ్వజమెత్తారు. ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలకు అనేక సమస్యలు ఉన్నాయి. నిరుద్యోగ యువత, రైతులు పలు ఇబ్బందులు పడుతున్నారు. కాంట్రాక్ట్, అవుట్ – సోర్సింగ్, అనేక రంగాల్లో పనిచేస్తున్న చిరు ఉద్యోగులు ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఈ అంశాలపై పోరాటాలను కొనసాగిస్తానని కేఎస్ లక్ష్మణరావు ప్రకటించారు.

40 శాతం మంది తొలిసారి ఓటర్లు

ఎన్నికల్లో గెలుపొందిన ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో 40 శాతం మంది తొలిసారి ఓటు హక్కును ఉపయోగించుకున్నారని చెప్పారు. తనపై వ్యతిరేక ప్రచారం చేసినా ఓటర్లు కూటమిని గెలిపించారని పేర్కొన్నారు. సమస్యలపై శాసన మండలిలో గళం విప్పుతానని వివరించారు.

రేపటి నుంచి గుడారాల పండగ



వివరాలు వెల్లడిస్తున్న అబ్రహం

అమరావతి: ఏటా నిర్వహించే గుడారాల పండగను ఈ ఏడాది గుంటూరు శివారులోని గోరంట్లలో కాకుండా మండల పరిధిలోని లేమల్లె గ్రామంలో నిర్వహించటానికి అన్ని ఏర్పాట్లనూ పూర్తిచేశామని హోసన్నా మినిస్ట్రీస్ అధ్యక్షుడు అబ్రహం చెప్పారు. మంగళవారం లేమల్లెలోని హోసన్నా దయాక్షేత్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ హోసన్నా మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు ఏసన్నా తొలుత లేమల్లె గ్రామంలో హోసన్నా మందిరం నిర్మాణం చేసిన ప్రదేశంలో సుమారు 25 ఏళ్ల తర్వాత 48వ గుడారాల పండగ నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈనెల 6,7,8,9 తేదీలలో జరిగే ఈ పండగకు విశ్వాసులు తరలిరావాలని కోరారు. ఆర్టీసీ గుంటూరు నుంచి ప్రత్యేకంగా బస్సులు నడుపుతున్నట్టు వెల్లడించారు.

మానవతా నాడి పట్టాలి

స్టెతస్కోప్ చెవిన పెట్టకుండానే లబ్‌డబ్ సవ్వడి వీనులను తాకిందా.. మది నిండా ఉప్పొంగిన భావోద్వేగం ఆనందబాష్పమై కురిసిందా.. ఆరేళ్ల శ్రమ కనుల వేడుకై మెరిసిందా.. ఎన్నాళ్లో వేచిన హృదయం 'పట్టా'భిషిక్తమై మురిసిందా.. అన్నట్టు గుంటూరు వైద్యకళాశాల సంతోషాల వేదికైంది. గ్రాడ్యుయేషన్ డే ఉత్సాహంతో ఉప్పొంగింది. విద్యార్థులు, తల్లిదండ్రుల ఆత్మీయ ఆలింగనాలతో నవ్వులు చిలికింది. ఈ సంబరమంతా తళుకులీని కెమెరాల్లో అందంగా బంధీయైంది.

- రోగులపై దయ చూపాలి
- డీఎంఈ డాక్టర్ నరసింహం
- ఉత్సాహంగా వైద్య కళాశాల 74వ గ్రాడ్యుయేషన్ డే

గుంటూరు మెడికల్: వైద్యులు రోగుల పట్ల జాలి, దయ కలిగి ఉండాలని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) డాక్టర్ డి.ఎస్.వి.ఎల్.నరసింహం అన్నారు. మంగళవారం గుంటూరు వైద్య కళాశాల జింఖానా ఆడిటోరియంలో 74వ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు జరిగాయి. వైద్య కళాశాల 2019 బ్యాచ్ ఎంబీబీఎస్ విద్యార్థులకు డీఎంఈ డాక్టర్ నరసింహం డిగ్రీ పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ నరసింహం మాట్లాడుతూ వైద్య రంగంలో మానవతా విలువలకు పెద్ద పీట వేయాలని చెప్పారు. వైద్య రంగంలో రోబోటిక్ టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ వచ్చినా హ్యూమన్ టచ్ ఇవ్వలేవని, వైద్యుడికే అది సాధ్యమని పేర్కొన్నారు. రోగిపై సానుభూతి, మానవతా దృక్పథం కలిగి ఉండాలన్నారు. వైద్యులు డబ్బుల కోసం ఆరాటపడకూడదని సూచించారు. అనంతరం నరసింహంను వైద్యశాల నిర్వాహకులు సత్కరించారు.



వైద్య విద్యయాభవ: పట్టాలతో నవ్వులు చిందిస్తున్న విద్యార్థులు

మాతృసంస్థ అభివృద్ధికి తోడ్పడండి

గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశశ్వి రమణ మాట్లాడుతూ గుంటూరు వైద్య కళాశాల పూర్వ విద్యార్థుల సహాయ సహకారాలతో రూ.100 కోట్లతో ఎంసీహెచ్ నిర్మాణం జీజీహెచ్‌లో జరుగుతుందని చెప్పారు. 2026 జనవరి నాటికి భవనం అందుబాటులోకి వస్తుందని, ప్రభుత్వం రూ.40 కోట్ల విలువ గల వైద్య పరికరాలు అందిస్తున్నట్లు వెల్లడించారు. వైద్య కళాశాలలో చదువుకున్నవారంతా వైద్య వృత్తిలో బాగా స్థిరపడిన తరువాత మాతృ సంస్థ అభివృద్ధికి తోడ్పడాలన్నారు.

యాంత్రిక వైద్యం వలదు

గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాగార్జునకొండ వెంకటసుందరాచారీ మాట్లాడుతూ రోగుల పట్ల జాలి, దయ కలిగి ఉండాలని, నేడు చాలా మంది వైద్యులు కఠినంగా మారిపోయారని పేర్కొన్నారు. రోబో మాదిరిగా యాంత్రికంగా వైద్యులు మారిపోయారని, వైద్య వృత్తి వ్యాపారంగా మారిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. కొత్తగా వైద్య వృత్తిలోకి వస్తున్నవారు మానత్వం కలిగిన వైద్యులుగా ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ శ్రీధర్, డాక్టర్ ప్రభాకర్, జింఖానా కో–ఆర్డినేటర్ పి.వి.హనుమంతరావు పాల్గొన్నారు.



కోలాహలం : పట్టా అందుకున్న వేళ తల్లిదండ్రులతో రైతు బిడ్డ



అమ్మమ్మ ఆశీస్సులతో : పట్టా అందుకున్న విద్యార్థిని

కిక్కిరిసిన ఆడిటోరియం

వైద్య విద్యార్థులకు పట్టా ప్రదానం వేడుకను కనులారా వీక్షించేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఫలితంగా వైద్య కళాశాల ఆవరణం, కళాశాల ఆడిటోరియం కిక్కిరిసిపోయాయి. గ్రాడ్యుయేషన్ డే సందర్భంగా కళాశాలను సుందరంగా తీర్చిదిద్దారు. ఎక్కువగా రైతు కుటుంబాలకు చెందిన పిల్లలు వైద్యులుగా పట్టాలు తీసుకుంటున్న నేపథ్యంలో ఈ కమనీయ దృశ్యాలను బంధించేందుకు తల్లిదండ్రులు ప్రత్యేకంగా వీడియోగ్రాఫర్లు, ఫొటోగ్రాఫర్లను పెట్టుకుని హాజరవడం అందరినీ ఆకట్టుకుంది. విద్యార్థులు పట్టాలు చేతపట్టుకుని కుటుంబ సభ్యులు, స్నేహితులతో కళాశాల ప్రాంగణంలోనే ఫొటోలు దిగి మురిసిపోయారు.



డీఎంఈ నరసింహంను సత్కరిస్తున్న దృశ్యం

'హాల్‌టికెట్ల కలర్ ప్రింటవుట్‌ను అనుమతించం'

నరసరావుపేట ఈస్ట్: ఇంటర్మీడియెట్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు తమ హాల్‌టికెట్లను వైట్ పేపర్‌పై ప్రింటవుట్ తీసుకొని పరీక్ష కేంద్రాలకు రావాలని జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాశాఖాధికారి ఎం.నీలావతిదేవి సోమవారం తెలిపారు. కొందరు విద్యార్థులు హాల్‌టికెట్లను కలర్ ప్రింట్‌లో తీసుకువస్తున్నారని, వాటిని అనుమతించటం లేదని పేర్కొన్నారు. ఈ మేరకు ఇంటర్మీడియెట్ విద్యామండలి నుంచి ప్రత్యేక ఉత్తర్వులు అందినట్టు వివరించారు. విద్యార్థులు గమనించి తమ వెంట తెల్లకాగితంపై ప్రింట్ చేసిన హాల్‌టికెట్లతో హాజరు కావాలని సూచించారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో మంగళవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం: రూ. 9,000 గరిష్ఠం: రూ. 12,500

మోడల్ ధర రూ. 11,500

పసుపు ధరలు

దుగ్గిరాల: స్థానిక పసుపు యార్డుకు మంగళవారం 66 బస్తాలు వచ్చినట్లు వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యదర్శి శ్రీనివాసరరావు ఒక ప్రకటనలో తెలిపారు. కొమ్ములు 43 బస్తాలు రాగా వాటి గరిష్ఠ ధర రూ.8,500, కనిష్ఠ ధర రూ.8,300, మోడల్ ధర రూ.8,500 పలికింది. కాయలు 23 బస్తాలు రాగా గరిష్ఠ, కనిష్ఠ ధరలు రూ.8,500, రూ.8,300, మోడల్ ధర రూ.8,500 పలికింది. మొత్తం 49 క్వింటాళ్ల అమ్మకాలు జరిగినట్లు తెలిపారు.

మిర్చి యార్డులో 1,27,375 బస్తాల విక్రయం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మిర్చి మార్కెట్ యార్డుకు మంగళవారం 1,25,574 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,27,375 బస్తాలు అమ్మకాలు జరిగాయి. ఈ సీజన్‌లో ఈ స్థాయిలో మిర్చి బస్తాలు రావడం ఇదే ప్రథమం. శని, ఆదివారాలు మార్కెట్ యార్డుకు సెలవు కావడంతో ఆదివారం రాత్రి నుంచే వాహనాల్లో మిర్చి బస్తాలను తీసుకురాగా యార్డు నిండిపోయింది. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల సగటు ధర రూ.9,000 నుంచి రూ.14,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.10,000 నుంచి రూ.14,000 వరకు ధర లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.7,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 70,117 బస్తాలు నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఎ.చంద్రిక తెలిపారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

ఏపీ ఎన్జీవో జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు



జెండా ఊపి క్రీడా పోటీలు ప్రారంభిస్తున్న దృశ్యం

గుంటూరు మెడికల్: ఒత్తిడితో నిత్యం సతమతమవుతున్న మహిళా ఉద్యోగులకు క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం లభిస్తోందని ఏపీ ఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు అన్నారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకుని గుంటూరులోని ఏపీ ఎన్జీవో హోంలో మహిళా ఉద్యోగులకు క్రీడాపోటీలు ప్రారంభమయ్యాయి. క్రీడా పోటీలను ఘంటసాల శ్రీనివాసరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ నాగూర్ షరీఫ్ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ మహిళలు ఒక పక్క ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూ మరోపక్క కుటుంబ బాధ్యతలతో బిజీగా ఉంటారన్నారు. అలాంటివారికి ఆటవిడుపుగా క్రీడలు ఎంతో ఉపయోగపడతాయని చెప్పారు. 200 మంది మహిళ ఉద్యోగులు పోటీల్లో పాల్గొన్నట్లు ఏపీ ఎన్జీఓ మహిళా విభాగం జిల్లా చైర్మన్ రాధారాణి అన్నారు. క్రీడల్లో పాల్గొన్న మహిళ ఉద్యోగులకు రెండు రోజులపాటు కలెక్టర్ సెలవు ప్రకటించారని బుధవారం కూడా క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు శ్యామ్‌సుందర శ్రీనివాస్, రాజశేఖర్, వెంకటరెడ్డి, సుకుమార్, శ్రీధర్‌రెడ్డి, సయ్యద్‌జానీబాషా, సూరి, కళ్యాణ్‌కుమార్, నాగేశ్వరరావు, మరీలు, కన్వీనర్ లక్ష్మీరమ్య, జాయింట్ సెక్రటరీ శివజ్యోతి పాల్గొన్నారు.

గురుకుల ఉర్దూ కళాశాలలో ప్రవేశాలు

గుంటూరు ఎడ్యుకేషన్: పాత గుంటూరు నందివెలుగురోడ్డులోని ఏపీ రెసిడెన్షియల్ ఉర్దూ బాలుర జూనియర్ కళాశాలలో 2025–26 విద్యాసంవత్సరానికి ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ పి.సాంబశివరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోస్తాంధ్రలో ముస్లిం, మైనార్టీ బాలుర విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న కళాశాలలో జూనియర్ ఇంటర్లో ప్రవేశానికి ఏప్రిల్ 25న జరగనున్న ఏపీఆర్జేసీ సెట్‌కు ఈనెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఏపీఆర్ఎస్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ఇతర వివరాలకు 87126 25073, 96525 69140 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

పొగాకు బోర్డు ఈడీ శ్రీధర్‌బాబుకు సత్కారం

కొరిటెపాడు(గుంటూరు): పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఏడున్నర సంవత్సరాల పాటు కేంద్ర ప్రభుత్వ సేవలు పూర్తి చేసుకుని ఉత్తరఖండ్ రాష్ట్రానికి వెళ్తున్న అద్దంకి శ్రీధర్‌బాబును పొగాకు బోర్డు పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు అసోసియేషన్ కార్యాలయంలో మంగళవారం సత్కరించారు. ఈ సందర్భంగా పొగాకు బోర్డు పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.ఎస్.మిత్ర మాట్లాడుతూ శ్రీధర్‌బాబు పొగాకు పరిశ్రమకు చేసిన సేవలు అసమానమైనవని, రైతులు, వ్యాపారులు, ఉద్యోగుల అభ్యున్నతికి చేసిన కృషి శ్లాఘనీయమని కొనియాడారు. పొగాకు పరిశ్రమ వ్యవస్థకే ఒక స్ఫూర్తిదాయక వ్యక్తి శ్రీధర్‌బాబు అని, కోవిడ్ సమయంలో ఆయన బోర్డు కార్యకలాపాలు సమర్థంగా నడిపిన తీరు అందరి ప్రశంసలు పొందారన్నారు. సత్కార గ్రహీత శ్రీధర్‌బాబు మాట్లాడుతూ పొగాకు బోర్డుకి సేవలు చేసే అవకాశం భగవంతుడు ఇచ్చిన అనుగ్రహం అని పేర్కొన్నారు. తన తల్లిదండ్రులు, గురువుల వద్ద నేర్చుకున్న సిద్ధాంతం 'అన్నదాత సుఖీభవ' అని రైతులు బాగుంటేనే దేశం బాగుంటుందని అదే నా విజయానికి కారణమని తెలిపారు.



అద్దంకి శ్రీధర్‌బాబును సత్కరిస్తున్న పొగాకు బోర్డు పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మిత్ర

యూబీఐ ఎంఎస్ఎంఈ రుణమేళా



రుణ మంజూరు పత్రాలను అందజేస్తున్న యూబీఐ చీఫ్ జనరల్ మేనేజర్ వాసుదేవన్

కొరిటెపాడు(గుంటూరు): యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గుంటూరు రీజియన్ పరిధిలో జీటీ రోడ్‌లోని ప్రాంతీయ కార్యాలయంలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల(ఎంఎస్ఎంఈ) రుణమేళా మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జీటీ రోడ్‌లోని యూబీఐ ప్రాంతీయ కార్యాలయంలో నిర్వహించిన ఎంఎస్ఎంఈ రుణమేళాలో యూబీఐ చీఫ్ జనరల్ మేనేజర్ బిజు వాసుదేవన్ మాట్లాడుతూ ఖాతాదారుల ఉన్నతికి యూబీఐ కృషి చేస్తోందన్నారు. ఖాతాదారుల ప్రయోజనాలే లక్ష్యంగా సేవలందిస్తున్నామని చెప్పారు. తక్కువ వడ్డీకే రుణాలు సకాలంలో ఇవ్వడంతో పాటు, డిపాజిట్ దారులకు లాభదాయకమైన వడ్డీ అందిస్తున్నట్లు వివరించారు. మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా యూబీఐ సేవలు విస్తరిస్తున్నామని, వీటిని ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లాలో గుంటూరు ఆటోనగర్, తెనాలి, మంగళగిరి పరిధిలో నిర్వహించిన సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల దారుల(ఎంఎస్ఎంఈ)కు రూ.150 కోట్ల విలువైన రుణ మంజూరు పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో యూబీఐ గుంటూరు రీజియన్ రీజినల్ హెడ్ ఎస్.జవహర్ పాల్గొన్నారు.

యూత్ పార్లమెంట్ పోటీలకు ఆహ్వానం



యూత్ పార్లమెంట్ పోటీ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

గుంటూరు ఎడ్యుకేషన్: యూత్ పార్లమెంట్ పోటీలను సద్వినియోగం చేసుకోవాలని నెహ్రూ యువ కేంద్ర జిల్లా యూత్ అధికారి కిరణ్మయి దేవిరెడ్డి పేర్కొన్నారు. పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాలలో మంగళవారం యూత్ పార్లమెంట్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ గుంటూరు, బాపట్ల, పల్నాడు, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల నుంచి 18 ఏళ్ల నుంచి 25 ఏళ్ల లోపు వయస్సు కలిగిన వారు యూత్ పార్లమెంట్ పోటీలలో పాల్గొనవచ్చని సూచించారు. తొలుత ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మై భారత్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని, ఒక్క నిమిషం నిడివి కలిగిన 'వాట్ డస్ వికసిత్ భారత్ మీన్ టూ యూ అనే అంశం పైన వీడియో చేసి ఈనెల 9వ తేదీ అర్ధరాత్రి 11–59లోగా మై భారత్ పోర్టల్‌లో అప్లోడ్ చేయాలని సూచించారు. ఈ విధంగా నమోదు చేసుకున్న వారిని స్క్రీనింగ్ చేసి జిల్లా స్థాయిలో ఎంపిక చేస్తారని వివరించారు. ఆయా జిల్లాల నుంచి ఎంపికైన వారికి జిల్లా స్థాయిలో టీజేపీఎస్ కళాశాలలో 150 మంది విద్యార్థులకు పోటీ ఉంటుందని పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో 'వన్ నేషన్, వన్ ఎలక్షన్ : పేవింగ్ ది వే ఫర్ వికసిత్ భారత్ అనే అంశంపై 3 నిముషాలు మాట్లాడాలని తెలిపారు. వర్శిటీ ప్రొఫెసర్లు, అధ్యాపకులు, ఆయా జిల్లాల ఎన్ఎస్ఎస్ అధికారులు, యూత్ నాయకులు, నెహ్రూ యువ కేంద్ర అధికారులు, ఇతర అధ్యాపకులు, సామాజిక కార్యకర్తలు పోటీల గురించి యువతకు అవగాహన కల్పించి, ఎక్కువ సంఖ్యలో పాల్గొనేలా చూడాలని చెప్పారు. వివరాలకు డాక్టర్ జేవీ సుధీర్ కుమార్ (9849854221), కిరణ్మయి దేవిరెడ్డి (9177753393)ని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.అనితాదేవి డాక్టర్ బీవీహెచ్ కామేశ్వర శాస్త్రి, సీహెచ్ రాంబాబు, ఆర్.జయశైలజ పాల్గొన్నారు.

క్రీడాస్ఫూర్తిని పెంపొందించుకోవాలి



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న డాక్టర్ దామోదర్ నాయుడు

పెదకాకాని: క్రికెట్ లీగ్ పోటీలు నిర్వహించడం ద్వారా పశు వైద్యుల్లో క్రీడాస్ఫూర్తి పెంపొందుతాయని రాష్ట్ర పశుసంవర్ధక సంచాలకులు డాక్టర్ దామోదర్ నాయుడు అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్స్ సర్వీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం రాష్ట్ర పశువైద్యుల క్రికెట్ లీగ్ –2025 పోటీలు ఘనంగా ప్రారంభించారు. మండలంలోని నాగార్జున యూనిర్సిటీ రోడ్డులోని డాక్టర్స్ స్పోర్ట్స్ అకాడమీలో పోటీలను డాక్టర్ దామోదర నాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటువంటి క్రీడా కార్యక్రమాల ద్వారా పశువైద్యుల్లో నూతనోత్సాహం, స్నేహ సంబంధాలు పెంపొందుతాయన్నారు. ఈ తరహా క్రీడలు ఎక్కువగా జరిపించాలని సూచించారు. రాష్ట్ర వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్స్ సర్వీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ జయప్రకాష్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పశువైద్యుల క్రికెట్ లీగ్– 2025 ఏడో తేదీ వరకూ జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గొర్రెల, మేకల అభివృద్ధి సహకార సమాఖ్య లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్, డాక్టర్ రజనీ కుమారి, గుంటూరు జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి ఓ నరసింహారావు, రాష్ట్ర వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్స్ సర్వీస్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ డాక్టర్ ఈశ్వర్‌రెడ్డి, గుంటూరు జిల్లా వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు హాజరయ్యారు. 13 ఉమ్మడి జిల్లాల నుంచి పోటీలలో పాల్గొనే పశు వైద్య క్రీడాకారులతో పాటు సక్కు పాల్ట్రీస్ మేనేజింగ్ డైరెక్టర్ పరుచూరి వెంకట్‌రామ్, స్వస్తిక్ ఫార్మా, వర్షా గ్రూప్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

జోసిల్‌లో ఘనంగా జాతీయ భద్రత వారోత్సవాలు

మేడికొండూరు: మండల పరిధిలోని డోకిపర్రులోని జోసిల్ కర్మాగారంలో జాతీయ భద్రత వారోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆ సంస్థ సెక్రటరీ, డీజీఎం కోటా రఘురాం మాట్లాడుతూ మంగళవారం నుంచి పదో తేదీ వరకు భద్రతా వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పనిచేస్తున్న ప్రతి ఒక్కరూ భద్రతా ప్రమాణాలను పాటించాలని కోరారు. ఈ సందర్భంగా కార్మికులకు, ఉద్యోగులకు పలు రకాల పోటీలు, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు భద్రతపై వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సంస్థ అడ్వైజర్లు రామినేని బెనర్జీ బాబు, యడ్లపాటి భాను ప్రసాద్ పాల్గొన్నారు.

7న పోలీస్‌స్టేషన్లలో మహిళా ఫిర్యాదుల విండో



శిక్షణ ఐపీఎస్ అధికారి దీక్ష

నగరంపాలెం: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళల సమస్యల పరిష్కారానికి జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్లలో ఈనెల ఏడో తేదీన మహిళా ఫిర్యాదుల విండోను నిర్వహించనున్నట్లు శిక్షణ ఐపీఎస్ అధికారి దీక్ష మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు ఈ వినూత్న కార్యక్రమాన్ని చేపట్టామని చెప్పారు. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను స్థానిక పోలీస్‌స్టేషన్లల్లోని పోలీస్ అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని చెప్పారు.

నూతన ఎమ్మెల్సీలను అభినందించిన మంత్రి లోకేష్



నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్సీలతో మంత్రి లోకేష్

మంగళగిరి టౌన్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించిన ఆలపాటి రాజేంద్రప్రసాద్, పేరాబత్తుల రాజశేఖరం మంగళవారం మంగళగిరి పార్టీ కార్యాలయంలో మంత్రి నారా లోకేష్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్సీలను ఆయన అభినందించారు. మంత్రి మాట్లాడుతూ ఈ విజయంతో మనపై మరింత బాధ్యత పెరిగిందని అన్నారు. యువత మనపై పెట్టుకున్న ఆశలను నెరవేర్చే దిశగా చిత్తశుద్ధిగా పనిచేయాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, రఘురామ్, ముమ్మడివరం ఎమ్మెల్యే సుబ్బరాజు, పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ పాల్గొన్నారు.

మైనార్టీ బాలికల పాఠశాలలో ప్రవేశాలు

గుంటూరు ఎడ్యుకేషన్: పొన్నూరు రోడ్డు సంగడిగుంటలోని ఏపీ రెసిడెన్షియల్ మైనార్టీ బాలికల పాఠశాలలో 2025–26 విద్యాసంవత్సరానికి ప్రవేశాలు కల్పించనున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఎ.బాలాశ్రీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతిలో 80 సీట్లు, 6,7,8 తరగతుల్లో మిగిలిన మైనార్టీ, ఎస్సీ, ఎస్టీ ఖాళీల భర్తీ కోసం కోసం ఆసక్తి గల విద్యార్థినులు ఈనెల 31లోగా ఏపీఆర్ఎస్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆయా తరగతుల్లో ప్రవేశాలకు ఏప్రిల్ 25న ప్రవేశ పరీక్ష జరుగుతుందని, వివరాలకు 87126 25039 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఆర్మీ జవానుపై కేసు

చీరాల: ప్రేమించి పెళ్లి చేసుకొని ఓ బిడ్డను కన్న తర్వాత ఆ బిడ్డ తనకు పుట్టలేదని భార్యను వేధిస్తూ పుట్టింటికి పంపించివేయడంతో భార్య ఫిర్యాదు మేరకు ఈపూరుపాలెం పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. వెదుళ్లపల్లికి చెందిన లక్ష్మారెడ్డి కావూరివారిపాలేనికి చెందిన కొచ్చెర్ల సుధారాణి ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వీరికి ఒక చిన్న బాబు పుట్టాడు. అయితే మొదటి నుంచి భార్యను వదిలించుకోవాలని చూస్తున్న ఆర్మీ జవాను ఆ బిడ్డ తనకు పుట్టలేదని అనుమానించి ఆమె పుట్టింటి వద్ద వదిలేసి వెళ్లాడు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆర్మీ జవాను లక్ష్మారెడ్డిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బాలబాలికల కబడ్డీ జట్ల ఎంపిక



ఎంపికైన ఉమ్మడి గుంటూరు జిల్లా కబడ్డీ జట్టు

బాపట్ల: ఉమ్మడి గుంటూరు జిల్లా కబడ్డీ సబ్ జూనియర్ బాలబాలికల జట్ల ఎంపిక బాపట్ల మున్సిపల్ హైస్కూలులో మంగళవారం నిర్వహించారు. ఎంపికైన జట్లు ఈనెల 14,15,16 తేదీలలో కడప జిల్లాలో నిర్వహించనున్న అంతర్‌జిల్లాల కబడ్డీ పోటీల్లో పాల్గొంటాయని గుంటూరు జిల్లా (కబడ్డీ) సెక్రటరీ మంతెన సుబ్బరాజు తెలిపారు. బాలికల జట్టులో జె.ప్రవల్లిక, సారిక, కీర్తి, హాసిని, సలోమి, ఆసిఫా, అమూల్య, శ్రావ్య (నరసాయపాలెం), కీర్తన(పేరలి), అంజలి, భార్గవి (నిజాంపట్నం), మౌనిక, దుర్గ, యామిని (ఎంపీపాలెం), బాలుర జట్టు ఎస్.హేమంత్, జ.మహిమరాజు, ఎస్.కె.జుబెల్, కె.మణికంఠరెడ్డి, శ్రీనివాసులు, ప్రభు, ప్రశాంత్ (మునిసిపల్ హైస్కూల్, బాపట్ల), సాయి హర్షవర్ధన్ రెడ్డి, నాగభూషణ్, తేజ, చిన్న అయ్యప్ప (కర్లపాలెం), సుబ్బారావు, పోల్‌రెడ్డి (పేరలి), ప్రేమ్‌చంద్, మణి (దాచేపల్లి)లను ఎంపిక చేశారు. కార్యక్రమంలో పీడీలు కత్తి శ్రీనివాసరావు, ఎన్.కుటుంబరావు, పి.శైలజ, కోచ్ తిరుపతమ్మ (పీఈటీ) ఎం.సాయికుమార్ పాల్గొన్నారు.

మద్యం మత్తులో వ్యక్తిపై కత్తితో దాడి

- గొంతుకోసే యత్నం చేసిన దుండగుడు
- అడ్డుకుని దేహశుద్ధి చేసిన స్థానికులు
- ద్రోణాదుల బెల్ట్ షాపులో ఘటన

మార్టూరు: మద్యం మత్తులో ఓ వ్యక్తిపై మరో వ్యక్తి కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. ఈఘటన మండలంలోని ద్రోణాదుల గ్రామంలో మంగళవారం జరిగింది. సేకరించిన వివరాల మేరకు.. గ్రామంలోని ప్రభుత్వ వైన్స్ షాప్ ఎదురుగా ఉన్న బాషా రెస్టారెంట్ పేరుతో ఓ మహిళ బెల్ట్ షాపు నిర్వహిస్తోంది. అదే గ్రామానికి చెందిన ముప్పరాజు చిన్నా, షేక్ జాన్ అనే ఇద్దరు వ్యక్తులు కూర్చుని మద్యం తాగుతున్నారు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య ప్రారంభమైన స్వల్ప వివాదం పెరిగి ఘర్షణకు దారితీసింది. మద్యం మత్తులో క్షణికావేశానికి గురైన జాన్ రెస్టారెంట్లో ఉన్న కత్తి తీసుకొని మొదట చిన్నాను కాలితో బలంగా తన్నాడు. ఆ ధాటికి చిన్నా రెస్టారెంట్ బయట గల బురదలో పడగా జాన్ చిన్నా వెంటపడి కత్తితో తలపై బలంగా దాడి చేయడంతో గాయమైంది. జాన్ అంతటితో ఆగక చిన్నా మెడపై కత్తి పెట్టి కోసే ప్రయత్నం చేశాడు. అప్పటి వరకు ఈ తతంగాన్ని గమనిస్తున్న స్థానికులు ఒక్కసారిగా అప్రమత్తమై జాన్‌ను చుట్టిముట్టి అతని చేతిలోని కత్తిని బలవంతంగా లాక్కొని విడిపించారు.

అనంతరం జాన్‌కు దేహశుద్ధి చేసిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు జాన్‌ను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. బాధితుడు చిన్నాను చికిత్స నిమిత్తం మార్టూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా కోలలపూడి గ్రామానికి చెందిన 8 మంది యువకులు జొన్నతాళి సెంటర్‌లోని సూర్య దాబా నిర్వాహకులు ముగ్గురిపై మద్యం మత్తులో బీరు సీసాతో కొట్టి ధ్వంసం చేసి వారం రోజులు కూడా గడవక ముందే ద్రోణాదులలో ఈ ఘటన జరగటం మండలంలో తీవ్ర భయాందోళనలు రేకెత్తిస్తోంది.